క్లుప్తంగా

నిఘా నేత్రాలు.. నేల చూపులు



రంగారెడ్డినగర్: జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన చౌరస్తాలు, రోడ్ల వెంబడి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రజల భద్రతకు... ఉల్లంఘనలపై జరిమాన విధించేందుకు.. నేరస్తులను పట్టించడంలో కీలక భూమిక పోషించే సీసీ కెమెరాలు నేల చూపులు చూస్తున్నాయి. సీసీ కెమెరాల నిర్వహణను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించిన అధికారులు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో వారు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతునారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల సీసీ కెమెరాల నిర్వహణ విషయంలో శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. వాల్వో, వికాస్ ఫీడర్ల పరిధిలోని తెలంగాణ ఇంజినీర్స్ బిల్డింగ్, ఎన్‌జీ0ఆర్ కన్‌స్ట్రక్షన్స్, టెక్నో పోలీస్, కోకకోలా చౌరస్తా, వాల్వో షోరూమ్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పూల గిరాకీ



సుభాష్‌నగర్: ఓ వైపు బతుకమ్మ.. మరోవైపు దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా పూలకు గిరాకీ పెరిగింది. మంగళవారం సుచిత్ర చౌరస్తాలో ఓ పూల దుకాణంలో ఓ వ్యక్తి పూలదండ అల్లుతున్న దృశ్యాన్ని 'సాక్షి'కెమెరా క్లిక్‌మనిపించింది.

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

కుత్బుల్లాపూర్: దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవార్తను అన్నపూర్ణాదేవిగా, వివిధ కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ఉదయం నుంచి నిర్వహించిన కుంకుమార్చనల్లో భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు.






నిబంధనలు పాటించాల్సిందే..

ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేశాం

- 260 మంది నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకుంటున్నాం
- ఇప్పటి వరకు రూ.1.2 కోట్లు, 8.5 కిలోల బంగారం, 9.5 కిలోల వెండి స్వాధీనం
- మేడ్చల్ డీసీపీ శబరీష్

జంగ్ 2023 తెలంగాణ





కుత్బుల్లాపూర్: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ డీసీపీ శబరీష్ స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో అసెంబ్లీ ఎన్నికల దష్ట్యా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి జల్లెడ పడుతున్నారు. మేడ్చల్ డీసీపీ పరిధిలో పేట్‌బషీరాబాద్, శామీర్‌పేట్, అల్వాల్, మేడ్చల్, సూరారం, దుండిగల్, జినో వేల్యూ పోలీస్ స్టేషన్లో పరిధిలో విస్తృత తనిఖీల ద్వారా పట్టుబడుతున్న డబ్బుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు, గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలు ద్వారా స్వాధీనం చేసుకున్న వాటి వివరాలతో పాటు మరి కొన్ని అంశాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

- మేడ్చల్ డివిజన్ పరిధిలో సుమారు 260 అనుమతులు తీసుకొని ఆయుధాలు వినియోగిస్తున్న వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేసి వారి వద్ద నుంచి సుమారు 70శాతం ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరో 30శాతం రావాల్సి ఉందన్నారు.
- ఎన్నికల కమిషన్ సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచన మేరకు శివారు ప్రాంతంలోని అల్వాల్, జినోవ్యాలీ, శామీర్‌పేట్, మేడ్చల్, దుండిగల్ ఐదు పోలీస్‌స్టేషన్ల పరిధిలో అటు జాతీయ రహదారి ఇటు రాష్ట్ర రహదారిలపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.
- ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న నగలు, నగదు స్వాధీనం చేసుకొని ఐటీ శాఖకు అప్పగిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 1.2 కోట్ల రూపాయల నగదుతో పాటు 8.5 కిలోల బంగారం, 9.5 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు ఈ తనిఖీలు కొనసాగుతూనే ఉంటాయని పేర్కొన్నారు.
- ప్రతి ఒక్కరూ విలువైన నగలు డబ్బు తీసుకువెళ్లే క్రమంలో వాటికి పూర్తి ఆధారాలు ఉంటేనే తీసుకు వెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. లేదంటే సీజ్ చేస్తామని పేర్కొన్నారు.
- తనిఖీల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పాత నేరస్తులు వివిధ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చేపడుతున్న సమాచారం తెలుసుకొని వారిని కూడా అదుపులోకి తీసుకొని 10.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని అదుపులో తీసుకున్నామని తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు కొనసాగితే సమాచారం ఇవ్వాలని తప్పకుండా కట్టడి చేస్తామని హామీ తెలిపారు.
- ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మద్యం బెల్టు షాపులపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు కొనసాగిస్తున్నామని ఇప్పటివరకు 3.5 లక్షల విలువ చేసే 470 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు గుర్తు చేశారు.
- పోలింగ్, కౌంటింగ్ విషయంలో సిబ్బందికి ఇప్పటికే ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసి పక్క ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటన జరిగితే క్షణాల్లో చేరుకునేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. కావాలని ఎవరైనా గొడవకు దిగితే మాత్రం ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత





- బూత్ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్
- కోడ్ వచ్చే ముందు శంకుస్థాపనలతో హడావిడి
- ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని వ్యాఖ్య

దుండిగల్: భారత ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు... బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నియోజకవర్గ బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం గండిమైసమ్మలోని వేదిక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి కర్ణాటక మాజీ మంత్రి డా. సుధాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని అన్నారు. మోదీ పాలనలో అభివృద్ధి చెందుతున్న భారత్‌వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయన్నారు.

ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మడం లేదు..

- కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... స్థానిక ఎమ్మెల్యే వైఫల్యాలను వివరిస్తూ... బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం బూత్ స్థాయి శ్రేణులు కృషి చేయాలన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని నమ్మడం లేదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఖాయమన్నారు. తొమ్మిదేళ్లుగా ప్రజలకు ఏం చేయకుండా ఎన్నికల కోడ్ వచ్చే ముందు హడావిడిగా శంకుస్థాపనలు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.
- బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస్, పార్లమెంట్ కో-కన్వీనర్ రాజు, అసెంబ్లీ ప్రభారీ జగన్, విస్తారక్ రాణా ప్రతాప్, రాష్ట్ర నాయకులు నందనం దివాకర్, సులోచన, చండి శ్రీనివాస్, ఎంఎస్ వాసు, విఘ్నేశ్వర్, బక్క శంకర్‌రెడ్డి, గరిగే శేఖర్, బావిగడ్డ రవి, పత్తి రఘుపతి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యం అందించడం హర్షణీయం



ఆస్పత్రి సిబ్బందితో నిఖత్ జరీన్

బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్

దుండిగల్: పేదలకు ఉచితంగా వైద్యం అందించడం గొప్ప విషయమని ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ అన్నారు. దుండిగల్‌లోని మర్రి అరుంధతీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రోగులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నాయకుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి తన తల్లికి ఇచ్చిన మాట ప్రకారం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించి ఉచితంగా వైద్య సేవలను అందించడం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె వెంట ఎంఎల్ఆర్ఐటీ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

ఆ వేతన ఒప్పందంతో...

డా. రెడ్డీస్ ల్యాబ్స్‌కు సంబంధం లేదు..

కుత్బుల్లాపూర్: 'కార్మికుల శ్రేయస్సే ధ్యేయం' శీర్షికన ఈ నెల 14న సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్తా కథనం విషయంపై డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ మంగళవారం వివరణ ఇచ్చింది. బీఆర్ఎస్ కేవీ యూనియన్ అధ్యక్షుడు ముద్దాపురం మదన్‌గౌడ్ డా. రెడ్డీస్ ఫ్యాక్టరీలో యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నట్లు.. జీడిమెట్ల ప్లాంటుతో ఆయన ఒక ఒప్పందం మీద సంతకాలు చేశారని వచ్చిన వార్త నిజం కాదని తేల్చి చెప్పారు. కానీ...! ఆ వార్తలో రాసిన ఫ్యాక్టరీ ప్రస్తుతం డాక్టర్ రెడ్డీస్ యాజమాన్యం ఆధీనంలో లేదని తెలిపింది. 2018లోనే డాక్టర్ రెడ్డీస్ సంస్థ ఫ్యాక్టరీని 'థెరాపివా' ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు విక్రయించిందని పేర్కొంది. అందువల్ల ఆ ఫ్యాక్టరీతో వేతన ఒప్పందం చేసుకోవడానికి డా. రెడ్డీస్ ల్యాబ్స్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇదే విషయంపై కార్మిక నేత మదన్‌గౌడ్ సైతం తాము పత్రిక ప్రకటన గతంలో ఉన్న పరిశ్రమ పేరు తప్పుగా రాసి పంపించామని తెలిపారు. మరొకసారి ఇటువంటి పొరపాటు జరగకుండా చూస్తామని ఆయన పేర్కొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం



ఖాజామియాకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేత ఖాజామియా బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... అన్ని మతాలకు తమ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విధానాలకు ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. వచ్చేది మళ్లీ తమ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్రా అశోక్, మాజీ కౌన్సిలర్ కృష్ణారావు, ఎత్తరి మారయ్య, సిద్ధిఖీ, కార్తీక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'ఇండస్ట్రీ 5.0' వ్యాపార సంబంధాలలో ఒక కొత్త అధ్యాయం



మహీంద్రా విశ్వవిద్యాలయంలో మూడో వార్షిక ఇండో - జర్మన్ సదస్సుకు హాజరైన ప్రముఖులు

జర్మన్ మిషన్ డిప్యూటీ హెడ్ జార్జ్ ఎంజ్‌వీలర్

సుభాష్‌నగర్: భారత్, జర్మనీల మధ్య కొనసాగుతున్న సహకారంలో భాగంగా మంగళవారం బహదూర్‌పల్లిలోని మహీంద్రా విశ్వవిద్యాలయం మూడో వార్షిక ఇండో - జర్మన్ సెంటర్ ఫర్ బిజినెస్ ఎక్సలెన్స్ కాన్ఫరెన్స్‌ను విజయవంతంగా నిర్వహించారు. 'భారత్, జర్మనీలలో పునరాలోచన తయారీ, స్థిరమైన అభివృద్ధి కోసం సాంకేతికత, ఆవిష్కరణ' అనే నినాదంతో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్సిటీ డీన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డాక్టర్ రామకృష్ణ వేలమూరి మాట్లాడారు. ఈ సదస్సును నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం అకడమిక్ కార్పొరేట్ సహకారాన్ని పెంపొందించుకోవాలనే తమ దృక్పథం సంపూర్ణంగా సరిపోతుందన్నారు. పరిశ్రమ 5.0 యుగంలో అత్యాధునిక సాంకేతికతను స్వీకరించాలన్నారు.

- జర్మన్ మిషన్ డిప్యూటీ హెడ్ జార్జ్ ఎంజ్‌వీలర్ మాట్లాడుతూ... ఇండస్ట్రీ 5.0 ఇండో-జర్మన్ వ్యాపార సంబంధాలలో ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తుందన్నారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసే ఈ సమావేశంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. తయారీ ఐసీటీ కలయిక పరిశ్రమలో 5.0 అనేది ఒక పరివర్తనాత్మక ప్రయాణం, ఈ వేదిక ద్వారా దాని ప్రాముఖ్యత గురించి చర్చించామన్నారు.

'ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు'

దుండిగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో ప్రజలు అన్ని రకాలుగా మోసపోయారని.. అందుకే కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట ఇందిరమ్మ కాలనీవాసులు హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పథకాలను వివరించాలన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి

ప్రమాద ఘంటికలు.. శిథిల స్తంభాలు



గురుమూర్తినగర్ కమ్యూనిటీహాల్ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో స్తంభం కింది భాగం ఒంగి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి గుండానే ప్రతినిత్యం గురుమూర్తినగర్ నుంచి ఏపీహెచ్‌బీ కాలనీ రోడ్డు మీదుగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్ స్తంభానికి ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - రంగారెడ్డినగర్

పోలీసుల ఫుట్‌మార్చ్

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అదే విధంగా సెక్టార్ల వారీగా ఫుట్ మార్చ్‌ను నిర్వహిస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్, సూరారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో మేడ్చల్ జోన్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, దుండిగల్ సీఐ రామకృష్ణ, సూరారం సీఐ వెంకటేశ్వరరావుతో పాటు దాదాపు 55 మంది సిబ్బంది ఆయా ప్రాంతాల్లో ఫుట్ మార్చ్‌లో పాల్గొన్నారు. - దుండిగల్



కలెక్టర్ నోటీపై చేసినా పట్టదా?

- ఐదెకరాలు స్థలం స్వాధీనం చేసుకోవడంలో అధికారులు ఫెయిల్
- స్థలాన్ని ప్రైవేట్ సంస్థకు ధారాదత్తం చేసేందుకు యత్నం
- ప్రగతినగర్‌లో ఆందోళనకు దిగిన బీజేపీ నాయకులు



ప్రగతినగర్‌లోని డంపింగ్‌యార్డు స్థలం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: డంపింగ్‌యార్డు, వైకుంఠ ధామానికి చెందిన ఐదెకరాల స్థలాన్ని రియల్ ఎస్టేట్ సంస్థకు ధారాదత్తం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కుట్రలు పన్నుతున్నారని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. ప్రగతినగర్‌లోని డంపింగ్‌యార్డు స్థలం వద్ద మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు.

- ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా ప్రగతినగర్‌లో డంపింగ్‌యార్డు, వైకుంఠధామం ఉందన్నారు. గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో లక్షలాది నిధులు వెచ్చించారన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత రూ.కోటి నిధులు వెచ్చించారని తెలిపారు. అయితే ఎక్సెల్ ప్రాపర్టీ సంస్థ తమ స్థలంలా పేర్కొంటూ డంపింగ్‌యార్డును ధ్వంసం చేసిందన్నారు.
- ఈ విషయం తెలుసుకుని ఆందోళనకు దిగడంతో ప్రజాప్రతినిధులు హడావుడిగా వైకుంఠధామాల నిర్మాణానికి.. రూ.50 లక్షలతో రోడ్డు మార్గానికి శంకుస్థాపన చేశారన్నారు. అయితే ఐదెకరాలు స్థలానికి కలెక్టర్ నోటీపై చేసినా కార్పొరేషన్ అధికారులు మాత్రం సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ సంస్థకు సదరు స్థలాన్ని ధారదత్తం చేసేందుకు కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోకుంటే బీజేపీ ఆధ్వర్యంలో మరోమారు ఉద్యమిస్తామని హెచ్చరించారు.
- ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జయంతి కన్వీనర్ దాసి నాగరాజు, కార్పొరేషన్ సెక్రటరీలు శ్రీనివాస్‌గుప్తా, అరుణ్‌కుమార్, అజయ్‌కుమార్ రెడ్డి, సోషల్ మీడియా కోకన్వీనర్ విజయ్ కుమార్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్ గౌడ్, లడ్డుగౌడ్, ఉదయం ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు మైలవరం అశోక్, రమేష్, రంగరాజు, అంజి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట రిజర్వాయర్ ఎదురుగా ఉన్న మ్యాన్‌వాల్వ్ చాంబర్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో చాంబర్‌పై ఇనుప రేకు మొత్తం తుప్పు పట్టి పోయింది. అంతే కాకుండా చాంబర్‌పై మూత లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా జలమండలి అధికారులు నిర్లక్ష్యం వీడి చాంబర్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. - చింతల్